11 . 08. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

సోమవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 75 , పేజీలు : 12 వెల:రూ.5/-

SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి కార్యకర్తలు కృషి చేయాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:** ఆదివారం నూతన సాత్నాల మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఆయన సమక్షంలో బిజెపిలో చేరారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం

- ముంపు ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటన
- అమీర్‌పేట్ గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి
- సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ యంత్రాంగం సూచన







**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:** భాగ్యనగరంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు వాతావరణ శాఖ మరోసారి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా రంగంలోకి దిగి, హైదరాబాద్‌లోని నీటి ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి అమీర్‌పేట్‌లోని గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌తో పాటు పలు లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. భారీ వర్షాల వల్ల రోడ్లపైకి చేరిన మురుగునీటిని, డ్రైనేజీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద నీటితో తాము పడుతున్న కష్టాలను స్థానికులు ముఖ్యమంత్రికి వివరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న రేవంత్ రెడ్డి, వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. పర్యటన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హైదరాబాద్ కమిషనర్‌ను, సిబ్బందిని ఆదేశించారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు.



## మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలోని హెలిప్యాడ్ లో దిగిన తెలంగాణ మంత్రులు

- ప్రైవేటు కార్యక్రమం కోసం మంగళగిరి వచ్చిన తెలంగాణ మంత్రులు
- జనసేన పార్టీ కార్యాలయం హెలిప్యాడ్‌లో దిగిన హెలికాప్టర్
- ఉప ముఖ్యమంత్రి భట్టి బృందానికి పవన్ కల్యాణ్ తరపున స్వాగతం
- స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ హరిప్రసాద్
- తిరుగు ప్రయాణంలో మంత్రులకు కొండపల్లి బొమ్మలు బహూకరించిన జనసేన నేతలు
- భట్టితో పాటు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి తదితరుల హాజరు

**అమరావతి వెలుతురు ఆగస్టు 10:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి అద్దం పట్టే ఆసక్తికర పరిణామం ఆదివారం మంగళగిరిలో చోటుచేసుకుంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో మంగళగిరి వచ్చారు.

### బెంగళూరులో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ లతో కలిసి

# ప్రధాని మోదీ మెట్రో రైడ్

- బెంగళూరు ఎల్లో లైన్ మెట్రో ప్రారంభోత్సవంలో ఆసక్తికర దృశ్యం
- ప్రధాని మోదీతో సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఆప్యాయ సంభాషణ
- మెట్రోలో ప్రధానికి ఇరువైపులా కూర్చుని ముచ్చటించిన కాంగ్రెస్ నేతలు
- రాజకీయ విమర్శలు పక్కనపెట్టి నవ్వుతూ కనిపించిన నేతలు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటోలు, వీడియోలు
- టెక్ హబ్ ఎలక్ట్రానిక్స్ సిటీని కలుపుతూ ఎల్లో లైన్ మెట్రో ప్రారంభం



**ఢిల్లీ వెలుతురు ఆగస్టు 10:** కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తరచూ తీవ్ర విమర్శలు చేసే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు... ఆయనతో ఎంతో ఆప్యాయంగా, నవ్వుతూ మాట్లాడటం విశేషం. బెంగళూరులో జరిగిన మెట్రో ప్రారంభోత్సవ వేడుక ఈ అరుదైన సన్నివేశానికి వేదికైంది. ఆదివారం నాడు బెంగళూరులో ఎల్లో లైన్ మెట్రో సేవల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్వీ రోడ్ మెట్రో స్టేషన్‌లో ప్రధానికి స్వాగతం పలికిన సీఎం సిద్ధరామయ్య.. పుష్పగుచ్ఛం అందిస్తూ ఆయన చేతిని పట్టుకుని ఆప్యాయంగా పలకరించారు. ఇక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అయితే,

# బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- కాషాయ దళంలో చేరిన గువ్వల బాలరాజు
- హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కండువా కప్పి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర చీఫ్
- గువ్వలతో పాటు మరికొందరు నియోజకవర్గ నేతలు కూడా బీజేపీలో చేరిక
- బీఆర్ఎస్‌లో సరైన గుర్తింపు లేదనే అసంతృప్తితో ఉన్న గువ్వల
- ఆయన చేరికతో తమ పార్టీ మరింత బలపడుతుందన్న బీజేపీ నేతలు
- కొద్దిరోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఊహాగానాలకు ముగింపు





**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. ఆదివారం నాడు హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బాలరాజుకు కాషాయ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గువ్వలతో పాటు ఆయన అనుచరులు, నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు కూడా బీజేపీ సభ్యత్వం స్వీకరించారు. కొన్ని రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి గువ్వల బాలరాజు ఏ పార్టీలో చేరతారనే దానిపై తీవ్రమైన చర్చ నడిచింది. గతంలో

### వీటిని ఎన్నికలు అనడానికే

# సిగ్గుగా ఉంది

- జడ్పీటీసీ ఉప ఎన్నికలపై జగన్ స్పందన
- పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు
- సీఎం చంద్రబాబుపై జగన్ తీవ్ర ఆరోపణలు
- అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలను హైజాక్ చేస్తున్నారని విమర్శ
- వైసీపీ నేతలపై టీడీపీ గ్యాంగులు దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నాయని ధ్వజం
- బాధితులపైనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన



**అమరావతి వెలుతురు ఆగస్టు 10:** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్య విరుద్ధంగా, అరాచకంగా వ్యవహరిస్తున్నారని, కుట్రలు, దాడులు, అబద్ధాలతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని వైసీపీ

# చిన్న పట్టణాలకూ ఐటీ...

### కేసీఆర్ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న కేటీఆర్

- ఆదిలాబాద్ ఐటీ టవర్ నిర్మాణంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ స్పందన
- చిన్న పట్టణాలకు కూడా ఐటీ విస్తరణను కొనసాగించాలని ప్రభుత్వానికి సూచన
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే టైర్-2 నగరాల్లో ఐటీ హబ్‌లకు శ్రీకారం
- స్థానిక యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా ఐటీ టవర్ల నిర్మాణం



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:** చిన్న పట్టణాలకు ఐటీ రంగాన్ని విస్తరించే విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన కృషిని కొనసాగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. దఆదివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిగా బడుగు బలహీన వర్గాలు ముందుకు పోవాలి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను స్ఫూర్తిగా తీసుకొని బడుగు బలహీన వర్గాలు ముందుకు పోవాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సర్దార్ పాపన్న మహారాజ్ ధర్మ పరిపాలన సంస్థ (ఎస్పీడీపీఓ) జై గౌడ్ ఉద్యమం – జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375 వ





# హంద్రీ–నీవాలో కృష్ణమ్మ పరవళ్లు చూసి నా మనసు పులకరిస్తోంది

- హంద్రీ-నీవా ప్రాజెక్టులో నీటి ప్రవాహంపై సీఎం చంద్రబాబు హర్షం,
- రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్న సీఎం,
- రికార్డు సమయంలో కాల్వల విస్తరణ వల్లే ఇది సాధ్యమైందని వెల్లడి,
- చివరి భూములకు కూడా నీరందించాలనే కల నెరవేరుతోందని వ్యాఖ్య,
- రైతుల సంతోషం తమ సంకల్పానికి మరింత బలాన్నిస్తోందన్న చంద్రబాబు



**అమరావతి వెలుతురు ఆగస్టు 10:** రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో కృష్ణా జలాల ప్రవాహంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్

(మొదటి పేజీ తరువాయి..)

## ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి కార్యకర్తలు కృషి చేయాలి



అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ .. బీజేపీ కార్యకర్తలకు వేదికగా నూతనంగా ఏర్పడిన మండలంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఎలా ఆదరించారు అలాగే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూడా పార్టీని ఆదరించాలని కోరారు. కార్యకర్తలు కూడా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కార దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కరుణాకర్ రెడ్డి అశోక్ రెడ్డి అస్తక్ సుభాష్. పోతారాజు రమేష్. సురేష్. పంద్ర రాము. రాథోడ్ రోహిదాస్. కుంచాల మహేందర్. సంతోష్.దొడ అశోక్. తిరుపతి. రేణుక బాయి. అంబరావ్. వెంకటి. రాము. సంతోష్. వసంత్. సురేష్ తదితరులు పాల్గొన్నారుద

## మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలోని హెలిప్యాడ్ లో దిగిన తెలంగాణ మంత్రులు

వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ నేరుగా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి ఉన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తరఫున శాసనమండలిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, ఇతర జనసేన నాయకులు తెలంగాణ మంత్రులకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వారంతా మంగళగిరిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తెలంగాణ మంత్రులు తిరుగు ప్రయాణమయ్యేందుకు తిరిగి జనసేన కార్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా వారితో కలిశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా పంపిన, తెలుగు సంస్కృతికి ప్రతీకలైన కొండపల్లి బొమ్మల జ్ఞాపికలను తెలంగాణ మంత్రులకు బహూకరించి జనసేన నాయకులు వీడ్కోలు పలికారు.

## బెంగళూరులో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ లతో కలిసి ప్రధాని మోదీ మెట్రో రైడ్

ప్రాజెక్టు వివరాలను ప్రధానికి ఎంతో ఉత్సాహంగా వివరించారు. కార్యక్రమం పూర్తయ్యాక ముగ్గురు నేతలు కలిసి కొత్త మెట్రో రైలులో ప్రయాణించారు. ఆర్‌వీ రోడ్ స్టేషన్ నుంచి బొమ్మనహళ్లి వరకు సాగిన 19.15 కిలోమీటర్ల ఈ ప్రయాణంలో ప్రధాని మోదీకి ఇరువైపులా సిద్ధరామయ్య, శివకుమార్‌లు కూర్చున్నారు. ప్రయాణమంతా ముగ్గురూ ఎంతో సరదాగా ముచ్చటించుకున్నారు. డీకే శివకుమార్ మెట్రో రైలు నుంచి బయటకు చూపిస్తూ ప్రధానికి పలు విషయాలు వివరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. నేతల మధ్య నవ్వులు విరిశాయి. రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి వారు ఇలా కలిసిపోయి ముచ్చటించుకోవడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముందు ప్రధాని మోదీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి టికెట్ కొనుగోలు చేశారు. అనంతరం ఎల్లో లైన్ మెట్రో సేవలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ మార్గం బెంగళూరు సెంట్రల్ డిస్ట్రిక్ట్‌ను టెక్ హబ్ అయిన ఎలక్ట్రానిక్స్ సిటీతో కలుపుతుంది. ప్రధానితో పాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 16 మంది విద్యార్థినులు, 8 మంది చిన్నారులు, 8 మంది మెట్రో కార్మికులకు ఈ రైలులో ప్రయాణించే అవకాశం దక్కింది. ప్రయాణంలో వారితో కూడా ప్రధాని ముచ్చటించారు.

## బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

తనపై దాడి జరిగినప్పుడు పార్టీ నాయకత్వం అండగా నిలవలేదని, తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన బీఆర్ఎస్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన పార్టీని వీడగా, తాజాగా బీజేపీలో చేరడంతో ఊహాగానాలకు తెరపడింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి గువ్వల బాలరాజు పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఆయన సేవలను పూర్తిగా వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులు పాల్గొని గువ్వల బాలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

## వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది

అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ఎన్నికలను హైజాక్ చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ గూండాలు, కొందరు అధికారులు, పోలీసులు కలిసి ఈ కుట్రను అమలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కుట్రపూరిత ప్రణాళికలను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. “ఉపఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే పోలీసులు దౌర్జన్యాలు మొదలుపెట్టారు. గతంలో ఎలాంటి కేసులు లేని వారిపై కూడా బైండోవర్ కేసులు పెట్టి వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు” అని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న తమ పార్టీ నేతలే లక్ష్యంగా టీడీపీ గ్యాంగులు దాడులకు తెగబడుతున్నాయని జగన్ ఆరోపించారు. ఆగస్టు 6న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నేత వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగిందని, వారి కారును ధ్వంసం చేసి నిప్పంటించే ప్రయత్నం కూడా చేశారని తెలిపారు. ఈ దాడుల సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని విమర్శించారు. వైసీపీ తరఫున పనిచేస్తే ఇలాంటి దాడులే ఎదురవుతాయని భయపెట్టడానికే ఈ దారుణాలకు పాల్పడ్డారని అన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా, బాధితులైన వేల్పుల రాముతో పాటు మరో 50 మందిపై ఆగస్టు 6న మధ్యాహ్నం 3:30 గంటలకు తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ ఆరోపించారు. “ఆగస్టు 8న మా పార్టీ నేతను బెదిరించి, ప్రలోభపెట్టి ఫిర్యాదు తీసుకుని రాఘవరెడ్డి, గంగాధర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి వంటి వారికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అదే రోజున పులివెందులలో వైసీపీకి ఓట్లు వేసే సుమారు 4,000 మంది ఓటర్లను ఇబ్బంది పెట్టేందుకు, పోలింగ్ బూత్‌లను గ్రామాలకు 2 నుంచి 4 కిలోమీటర్ల దూరానికి మార్చారు. బూత్ కబ్జా, రిగ్గింగ్‌కు ఆస్కారం కల్పించారు” అని ఆయన విమర్శించారు. పోలింగ్ రోజున మీడియా కవరేజీని నియంత్రించి, తమ దాడులు, దౌర్జన్యాలు బయటకు రాకుండా చూడాలని టీడీపీ ప్లాన్ చేస్తోందని జగన్ అన్నారు. “నిజం చెప్పాలంటే వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది. అయినా నాకు దేవుడిపై, ప్రజలపై నమ్మకం ఉంది. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది” అని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## చిన్న పట్టణాలకూ ఐటీ...

కేటీఆర్ స్పందిస్తూ, “కేసీఆర్ ప్రభుత్వ హయాంలో టైర్-2 నగరాలకు ఐటీని తీసుకెళ్లడం మా ప్రాధాన్యతగా ఉండేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి కృషి చేస్తుందని ఆశిస్తున్నాను” అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, సిద్దిపేటతో పాటు ఆదిలాబాద్‌లోనూ ఐటీ హబ్‌లను ప్రారంభించామని ఆయన గుర్తుచేశారు. చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలకు ప్లగ్-అండ్-ప్లే సౌకర్యాలు కల్పించడం, స్టార్టప్ వాతావరణాన్ని ప్రోత్సహించడం, టాస్క్ కేంద్రాల ద్వారా నైపుణ్యాభివృద్ధి అందించడం తమ లక్ష్యమని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ ఐటీ టవర్‌ను రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసింది. నిర్మాణ వ్యయం రూ. 58 కోట్లకు పెరిగినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసి పనులను కొనసాగిస్తోంది. ఈ టవర్ పూర్తయితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. సుమారు 68,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ జీ+4 భవనంలో 635 మంది ఉద్యోగులు పనిచేసేందుకు వీలుంటుంది. మూడు షిఫ్టుల్లో కలిపి దాదాపు 1,900 మందికి ఉపాధి లభించనుంది. టైర్-2 నగరాల్లోని ఐటీ టవర్లలో పూర్తిస్థాయిలో కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించేలా చూసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కంపెనీలను ఆకర్షించేందుకు మెరుగైన రోడ్లు, 24 గంటల విద్యుత్, ఫైబర్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐటీ అభివృద్ధిని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిగా బడుగు బలహీన వర్గాలు ముందుకు పోవాలి

జయంతి జాతీయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జై గౌడ్ ఉద్యమ వ్యవస్థాపకుడు వట్టికూటి రామారావు గౌడ్ సభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ మధు యాష్కీ మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, జోగి రమేష్, మాజీ ఎంపీ భరత్ గౌడ్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, గుల్బర్గా ఎమ్మెల్సీ జయదేవ్ గుత్తా, ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సర్దార్ పాపన్న చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి పాలించిన గొప్ప పోరాట యోధుడు ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సామాజిక పరిస్థితుల దృశ్య మిగతా సామాజిక వర్గాలను ఏకం చేసినప్పుడే సర్వాయి పాపన్న ఆశయాలను తీసుకుపోయిన వాళ్లమవుతామని ఆయన అన్నారు. వృత్తిని కాపాడే విషయంలో పోటీ ప్రపంచంలో మన పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలు పెంచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ఏదైనా పొరపాటు జరిగితే సరిదిద్దుకుంటానని, ఎవరు ఎప్పుడైనా కలవచ్చని, వృత్తి బంధువులకు అండగా ఉంటామని పొన్నం చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని సర్వాయి పేట లో పాపన్న గౌడ కోటకు 5 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈనెల 17 న సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సైదాపూర్ లో చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్ లో తాను, పీసీసీ అధ్యక్షుడు పాపన్న గౌడ్ విగ్రహాన్ని పెట్టించే బాధ్యత మాదన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ కులానికి సంబంధించిన వ్యక్తిగా బలహీన వర్గాల సంక్షేమానికి అందరిని కలుపుకొని పనిచేస్తామన్నారు. యాదగిరి గుట్ట , వేములవాడలో సత్రం నిర్మించామన్నారు. గతంలో కోటి 10 లక్షల ఈత మొక్కలు నాటం అని, ఈ ఏడాది 40 లక్షల ఈత మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ఈత, తాటి మొక్కలు పెద్ద ఎత్తున నాటి సంరక్షిస్తున్నామని వివరించారు. ఎక్కడ ప్రభుత్వ స్థలాలు ఉన్న , చెరువు కట్టల పై ఈత మొక్కలు నాటాలని, సర్వాయి పాపన్న గౌడ్ వారసులుగా మన వృత్తి రక్షణ చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## హంద్రీ-నీవాలో కృష్ణమ్మ పరవళ్లు చూసి నా మనసు పులకరిస్తోంది

మీడియాలో స్పందించారు. ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లు చూసి తన మనసు పులకరించిపోయిందని తెలిపారు. ఈ సీజన్‌లో ప్రాజెక్టు కింద ఉన్న చివరి భూములకు సైతం నీరందించాలనే తమ కల సాకారమవుతోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని సుమారు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, ప్రభుత్వం రికార్డు సమయంలో కాల్వల విస్తరణ పనులను చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ పనుల వల్లే ప్రస్తుతం హంద్రీ-నీవా కాల్వల్లో నీటి ప్రవాహం అత్యధిక సామర్థ్యంతో కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రతి ప్రాజెక్టును, ప్రతి చెరువును నింపి, చివరి ఆయకట్టు భూములను కూడా తడపాలన్నదే తమ ఆశయమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం కాల్వల్లోని నీటి ప్రవాహాలు రైతుల ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తున్నాయని తెలిపారు. రైతుల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషం, తమ ప్రభుత్వ సంకల్పానికి మరింత బలాన్ని చేకూరుస్తోందని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## బీజేపీతోనే గ్రామాలు అభివృద్ధి

**- మండల పార్టీ అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్**





**యాచారం వెలుతురు ఆగస్టు 10:**

ఆదివారం రోజున యాచారం మండలం తాటిపర్తి, కుర్మిద్దా గ్రామాలలో బూత్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ మిమ్మల్ని మోసం చేసిన బిఆర్ఎస్ పార్టీ ని మీకు మాట ఇచ్చి ఎలక్షన్ లో ఓట్లు వేయించుకొని గెలిచి గెలిచినా తరువాత మాట తప్పిన కాంగ్రెస్ పార్టీ ని నమ్మొద్దు అంటూ గ్రామాలలో జరిగిన అన్ని అభివృద్ధి కార్యక్రమలు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే జరిగినవని ఇప్పుడు లోకల్ బాడీలు లేక కేంద్రం నుండి వచ్చే నిధులు ఆగిపోయి గ్రామాలలో చిన్న చిన్న పనులు చేయడానికి కూడా డబ్బులు లేకుండా పోయిందని రాబోయే స్థానిక ఎన్నికలలో బిజెపి సర్పంచ్ లను, బిజెపి ఎంపీటీసీ జడ్పీటీసీ లను గెలిపించాలని కోరారు ఇట్టి కార్యక్రమం లో మండల ఎన్నికల కన్వీనర్ మేకల యాదగిరి రెడ్డి, బిజెపి మాజి మండల అధ్యక్షులు తాండ్ర రవీందర్, మాజి సర్పంచ్ రాయకంటి విజయ్ కుమార్, బీజేవైఎం జిల్లా నాయకులు గొరిగే బీరప్ప, నీలం రమేష్, మండల పార్టీ అధికార ప్రతినిధి సాటు మల్లేష్, బీజేవైఎం మండల నాయకులు సంగేమ్ శ్రీనాథ్, కొత్తగోళ్ల నాగేష్, సురిగి శ్రీనివాస్, బైకని శివ, కృష్ణ మురళి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రావిరాలలో గర్జిస్తున్న గ్రామ సింహాలు

**- రోడ్ల మీద ప్రయాణించాలంటేనే జంకుతున్న వాహనదారులు, స్థానికులు...**

**- పట్టించుకోని అధికారులు, పాలకులు, ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**వెలుతురు, తుక్కుగూడ ఆగస్టు 10 :**

మహేశ్వరం నియోజకవర్గంలోని రావిరాల గ్రామంలో వీధికుక్కల స్వైర విహారంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. గ్రామంలో రోడ్లపై కుక్కలు గుంపులుగా సంచ రిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మనుషులపై కుక్కలు దాడిచేసి గాయపరుస్తున్న నేపథ్యంలో ఎప్పుడు ఏ కుక్క ఎక్క డ కరుస్తుందో అన్న భయంతో పిల్ల లు, వృద్ధులు రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. గ్రామంలో గుంపు లుగా తిరుగుతూ పిల్లలపైకి దాడికి పాల్పడుతున్నాయి. ఇప్పటికే అదే గ్రామంలోని ఒక బాలికపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఈ నేపథ్యంలో రోడ్లపైన పిల్లలను ఆడుకునేందుకు కూడా తిరగ కుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీకుంటున్న పరిస్థితులు ఏర్పడ్డా యని స్థానికులు ఆందోళన చెందు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## దశదినకర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 10**

మండలం ఇంద్ర పాలనగరం గ్రామానికి చెందిన పల్లపు యాదయ్య మరియు పందుల పారిజాత అనారోగ్యంతో మరణించగా వారి యొక్క దశదినకర్మ కార్యక్రమాలు వారి ఇంటి వద్ద నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, మనోధైర్యం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షుడు గర్దాస్ విక్రమ్, కార్యదర్శి రవ్వ నరసింహ, నాయకులు సింగన బోయిన దశరథ, నిమ్మగడ్డ పద్మారావు, జెట్టి శివప్రసాద్, ఆవుల శ్రీధర్, బొడ్డుపల్లి రాజు, కుచం రమేష్, మర్రి మహేష్, పల్లపు అశోక్, వంగాల సాయికుమార్, గర్దాస్ శ్రీకాంత్, శివ, సాయి తదితరులు పాల్గొనడం జరిగింది.

## పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి



**మంచాల వెలుతురు ఆగస్టు10:**

మంచాల మండలం మంచాల గ్రామంలో జరిగిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొని పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన సహకార బ్యాంక్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి అనంతరం ఆలయకమిటీ సభ్యులు చైర్మన్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచాల గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ ఆరుట్ల మాజీ సర్పంచ్ సుంకరి పాండరి నాథ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్,నాయకుడు మారగోని సత్యనారాయణ గౌడ్ మంచాల మాజీ ఎంపీటీసీ రావుల మల్లేష్ నాయకులు ఓరుగంటి లింగం గౌడ్ కుమ్మరి రాములు కృష్ణ జంగయ్య ఆలయ కమిటీ సభ్యులు మాల్గ శ్రీశైలం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**నత్తి మల్లేష్ ముదిరాజ్ ను ఘనంగా సత్కరించిన ఎంపీలు ప్రజాప్రతినిధులు**





**మెదక్ జిల్లా (వెలుతురు న్యూస్) ఆగస్టు -10:-**

తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు మెదక్ జిల్లా బీసీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు భాజపా నాయకులు కాళ్లకల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ నత్తి మల్లేశం ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఆదివారం తమ స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మెదక్ మల్కాజిగిరి ఎంపీలు రఘునందన్ రావు ఈటెల రాజేందర్ లను నత్తి మల్లేశం ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీలు నత్తి మల్లేశం ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నత్తి మల్లేశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందరికీ అందించడానికి గడప గడపకు భాజపా బూత్ స్థాయి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు అంటూ స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి జాప్యం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని విమర్శించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల గెలుపు ఖాయమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు వివిధ సంఘాల నాయకులు వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు మల్లేష్ ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## పాలిటెక్నిక్ ఫీజులు పెంచి బడుగు బలహీన వర్గాల విద్యార్థులను చదువులకు దూరం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**పెంచిన ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే భరించి, పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ గడువును పొడిగించాలి.**

**బీసీ నేత జాజుల లింగంగౌడ్ డిమాండ్**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**

రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులను చదువుకు దూరం చేసే ఆలోచనలో భాగంగానే ఒకటేసారి పాలిటెక్నిక్ ఫీజులను రూ.14,900 నుంచి రూ.39,800 కు పెంచారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి పాలిటెక్నిక్ కోర్సులో చేరే వారు పేద కుటుంబాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారని ఒకేసారి ఇంత మొత్తంలో ఫీజులు పెంచితే చదువు ఎలా కొనసాగిస్తారని లింగంగౌడ్ ప్రశ్నించారు. ప్రజా పాలనాన్ని చెప్పి బడుగు బలహీన వర్గాలను చదువుకు దూరం చేయడమేనా ప్రజా పాలన అంటే ??పదో తరగతి అయిపోగానే పాలిటెక్నిక్ లో చేరి ఏదో ఒక చిన్న ఉద్యోగం చేయాలని అనుకుంటారని కానీ రాష్ట్ర ప్రభుత్వం వారి మీద గుది బండగా ఫీజుల రూపంలో ఉంచారని పెంచిన ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే భరించి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ గడువు పొడిగించాలని అన్నారు 50 శాతం సీట్లు కూడా నిండలేదని పేర్కొన్నారు దీనంతటికీ కారణం ఫీజులు పెంచడం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బుర శ్రీనివాస్ గోదా రవీందర్ పాల్గొన్నారు



డాక్టర్ కొమ్ము కిరణ్ ఉన్నత ఉద్యోగ నిమిత్తం అమెరికా వెళుతున్న సందర్భంగా శంషాబాద్ లోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అతని మిత్రులు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, రమేష్ ముదిరాజ్ వీడ్కోలు పలికిన్నారు

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**

## ఘనంగా సమర్పించిన కుమ్మర్ల తొలి బోనం వేడుకలు



**మునుగోడు వెలుతురు ఆగస్టు 10:**
పలివెల గ్రామంలో కుమ్మర్ల ఆధ్వర్యంలో కుమ్మర్ల తొలి బోనం వేడుకలు విజయవంతంగా అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుమ్మర్ల బోనం అధ్యక్షులు కొరుపోలు అశోక్, చిలువేరు సత్తయ్య, కొరుపోలు శ్రీనివాస్, కొరుపోలు రాములు, నరేష్, లింగయ్య, శ్రవణ్, స్వామి, రోజా, మానస తదితరులు పాల్గొన్నారు

## డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకున్న కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**
నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి హిమాయత్ నగర్ డివిజన్లో పలుచోట్ల నీళ్లు రోడ్లు జలమయం అయ్యాయి. పరిస్థితి గమనించిన హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ వెంటనే అధికారులకు అప్రమత్తం చేశారు కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ రాత్రంతా డివిజన్లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకున్నారు. అయితే ఇలా ఇది ఇలా ఉంటే డివిజన్లోని హైదర్గూడా లో ఒక గోడ నాని కూలిపోవడం జరిగింది ఘటన స్థలానికి కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్ వెళ్లి సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, జైస్వాల్, జై కృష్ణ, సందీప్ శేఖర్ హితేష్ తదితరులు పాల్గొన్నారు.

## నల్తూర్ గ్రామంలో క్లినిక్ , మెడికల్ స్టోర్ ప్రారంభోత్సవంలో కాట సుధా శ్రీనివాస్ గౌడ్





**నల్తూర్ వెలుతురు ఆగస్టు 10:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని నల్తూర్ గ్రామంలో రాజు నూతనంగా ఏర్పాటు చేసిన క్లినిక్ , మెడికల్ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు సమీపంలోనే వైద్య సదుపాయాలు అందించడం ప్రశంసనీయమని అభినందించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో ఇలాంటి సదుపాయాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.
ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురైన

## ఆంజనేయులు గౌడ్ ను ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్



**లక్దారం వెలుతురు ఆగస్టు 10:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని లక్దారం గ్రామానికి చెందిన ఆంజనేయులు గౌడ్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై, ప్రస్తుతం పెనేషియా మెరీడియన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆంజనేయులు గౌడ్ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# డబ్బులు రావా...? చిక్కులు వీడవా...?

### -స్లాట్లు రద్దు చేసుకున్న వారికి చెల్లింపుల్లో జాప్యం ఎందుకు ?



**మెదక్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 10 (వెలుతురు ):**
రెవెన్యూ శాఖలో సమస్యలు తీరక రైతులు అధికారుల చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.వివరాల్లోకి వెళ్తే....గత నాలుగేళ్ల క్రితం వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ల ఆధునికీకరణలో భాగంగా గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ను తీసుకొచ్చింది అయితే ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూములను విక్రయించడానికి స్లాట్ లో బుక్ చేసుకున్న రైతులు కొన్ని అనివార్య కారణాలవల్ల స్లాట్ లో రద్దు చేసుకున్నారు అయితే స్లాట్లు బుక్ చేసుకున్న సమయంలో చలానా రూపంలో కట్టిన రిజిస్ట్రేషన్ ఫీజు డబ్బులు తిరిగి రావడం లేదు.

**ధరణి పోర్టల్ వచ్చింది ఇలా.....**

రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి తహసిల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలుపెట్టింది.ఇంతవరకు బాగానే ఉంది.గతంలో భూమి లేని నిరుపేదలకు జీవనోపాధి కొరకు ప్రభుత్వం ఇచ్చిన లావణి భూములు వివరాలు ధరణి వెబ్సైట్లో లేకపోవడంతో కాస్త లో ఉండి సాగు చేస్తూ వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు పాసుబుక్కులు అందలేదు. ధరణి స్థానంలో ఈ ప్రభుత్వం భూభారతి అనే వెబ్సైట్ను తీసుకువచ్చింది. ఇప్పటికైనా సమస్య ఇక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది.

**బాధితుల బాధలు వర్ణనాతీతం....**

స్లాట్లు బుక్ చేసుకుని కుటుంబ తగాదాలు తదితర కారణాలతో రద్దు చేసుకున్న రిజిస్ట్రేషన్ డబ్బులు తిరిగి రైతుల ఖాతాల్లోకి రాకపోవడంతో ఈ సమస్య పరిష్కరించుకోవడానికి రైతులు స్థానిక తహసిల్దారు ఆర్డీవో కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.అయినప్పటికీ అధికారుల నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా పలు కారణాలతో స్లాట్లు రద్దు చేసుకున్నవారు వందల సంఖ్యలో ఉన్నారు.ప్రభుత్వం నుండి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఉన్నతాధికారులు కూడా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టతనిచ్చి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రేషన్ ఫీజు ఏ అకౌంట్ నుండి అయితే చెల్లించామో అట్టి సొంత అకౌంట్లకు డబ్బులు తిరిగి చెల్లించాలని ప్రభుత్వాన్ని బాధితులు కోరుతున్నారు.

# ఆహార భద్రతే కాదు..ఆత్మగౌరవం.

### లక్ష్మీపురం లో రేషన్ కార్డు పత్రాలు పంపిణి



**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 10:**
రేషన్ కార్డులు కేవలం ఆహార భద్రతకే కాదని పేదల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తాయని కాంగ్రెస్ మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్ అన్నారు.మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం లో ఎమ్మెల్యే మురళీ నాయక్ ఆదేశాల మేరకు ఆదివారం ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్ పాల్గొని పంపించేశారు.కార్యక్రమంలో డీలర్ ఉప్పలమ్మ,కాలేరు శివాజీ,కదిరే జగన్,కర్ణ కంటి వెంకటరెడ్డి,భూక్యా లాలూ, గండి మురళి గౌడ్,సంజీవ్ రెడ్డి,గుర్రం రాములు, భిక్షం, వెంకన్న, చిన్న వెంకన్న, చంద్రయ్య,లచ్చన్న,ముత్యాల మల్లయ్య, వెంకన్న, చిన్న వెంకన్న, అశోక్,పరమేష్, భద్రు, ఉప్పలయ్య, వీరస్వామి, ప్రభాకర్, కళ్యాణ్, శ్రీధర్, సాయిరాం, ప్రశాంత్,ముత్యాల రమ,జమునా రాణి గ్రామస్తులు పాల్గొన్నారు.

# తుత్తుర"ఐలయ్య"ఇకలేరు..

**- మూగబోయిన క్లారినెట్ ఫ్లూట్.**

**- తలకొరివి పెట్టిన పెద్ద కూతురు లావణ్య.**





**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 10:**
ఎంతోమంది వివాహాలకు క్లారినెట్ ఫ్లూట్ వాయిద్యం చేస్తూ బ్యాండ్ మాస్టర్ గా కొనసాగుతూ తుత్తుర ఐలయ్యగా పేరు తెచ్చుకున్న నాయిని ఐలయ్య ఇక లేరు. మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన నాయిని ఐలయ్య(57) జిల్లా అనుకుంట ప్రభుత్వ ఆసుపత్రి 3వ అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే కన్నుమూశాడు.బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గత 4గు రోజుల క్రితం ఫిట్స్ కారణంగా మానుకోట ఆసుపత్రికి తీసుకువెళ్లారు.చికిత్స పొందుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున హాస్పిటల్ నుంచి బయటికి వెళ్లే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు 3వ,అంతస్తు నుంచి కింద పడిపోయాడు.తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు.ఐలయ్యకు భార్య యాదమ్మ,ముగ్గురు కూతుర్లు లావణ్య,స్వాతి,యమున ఉన్నారు.ఐలయ్య అకాల కన్నుమూతతో ఆయన ఎంతో ఇష్టపడి పాటలు వాయిద్యం చేసే క్లారినెట్ ఫ్లూట్ మూగబోయింది.క్లారినెట్ వాయిద్యంతో ఆసక్తికరమైన పాటలు పాడుతూ ప్రజలను రంజింపజేసేవాడు. అందరికీ తలలో నాలిక వలె ఉంటూ మర్యాదగా ప్రవర్తించే ఐలయ్య అకాలంగా కన్నుమూయడంతో గ్రామంలో విషాదం నెలకొంది.ఐలయ్య కుమారుడు లేకపోవడంతో పెద్ద కూతురు లావణ్య తలకొరివి పెట్టింది.దీంతో బంధువులు గ్రామస్తులు కంటతడి పెట్టారు.

# నియోజకవర్గం ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

### కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఏ.చంద్రశేఖర్...






**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని డాక్టర్ అలిమోద్దీన్ మరియు వారి సతీమణి బెనజీర్ ఖానం ల నూతన హాయత్ ఎలైట్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో జహీరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజికవర్గంలో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆకాంక్షను అభినందిస్తూ డాక్టర్లను మరియు యాజమాన్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామ లింగారెడ్డి, పట్టణ అధ్యక్షులు కండేం. నర్సింలు, మండల అధ్యక్షులు హన్మంత్ రావ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, మాక్సూద్ అహ్మద్, సీనియర్ అడ్వొకేటే మహమ్మద్ షఫియోద్దీన్, కాంగ్రెస్ నాయకులు జె.జె.కన్స్ట్రక్షన్ జావీద్, ఖాజా, షౌకత్, శంషీర్, షాకిర్ అలీ, ముర్జల్, మాజిద్, ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రికుంట గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్





**గడ్డపోతారం వెలుతురు ఆగస్టు 10:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మంత్రికుంట గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని, గ్రామ ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి మరియు సుఖసమృద్ధులు కలగాలని ప్రార్థించారు.

## పలువురు మృతులకు ఎమ్మెల్యే నివాళులు.



**ఇనుగుర్తి / నెల్లికుదురు వెలుతురు ఆగస్టు 10:**
మానుకోట జిల్లాలోని ఇనుగుర్తి,నెల్లికుదురు మండలాలలోని పలువురి మృతుల భౌతిక కాయాలను సందర్శించి ఎమ్మెల్యే మురళి నాయక ఆదివారం సందర్శించి నివాళులర్పించారు.చిన్న ముప్పారం కు చెందిన కాంగ్రెస్ నేత మాజీ సర్పంచ్ చీ నూరి రవి అనారోగ్యంతో కన్నుమూయగా నివాళులర్పించారు. ఎంఆర్పిఎస్ జాతీయ నాయకులు గుండెపాక ఉప్పలయ్య ఇటీవల కన్నుమూయడంతో ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి ఉప్పలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం కావటి లింగమ్మకు,శ్రీరామగిరిలో గొల్లపల్లి కొమరుమల్లు గౌడ్ ల కు నివాళులర్పించారు.ఎమ్మెల్యే వెంట ఆ పార్టీ నాయకులు సత్యపాల్ రెడ్డి,ఆకుతోట సతీష్,మద్ది రాజేష్,క్రాంతి రెడ్డి,కొప్పు శ్రీను,కూరెల్లి సతీష్,కదిరె జగన్ తదితరులు ఉన్నారు. అంతకుమునుపు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదెల్ల యాదవ రెడ్డి, హెచ్ వెంకటేశ్వర్లు వలబోజు వెంకటేశ్వర్లు తదితరులు సంబంధిత మృతులకు నివాళులు అర్పించారు.

## కళావతి హెల్త్ పై ఎంపి రవిచంద్ర ఆరా..



**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 10:**
మండల కేంద్రం ఇనుకుర్తికి చెందిన గంజి కళావతి(కాంగ్రెస్ పార్టీ ఇనుగుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు గంజి రాజేందర్ రెడ్డి తల్లి) ఆరోగ్యంపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆరా తీశారు. కళావతి అనారోగ్యంతో హనుమకొండ రోహిణి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న వద్దిరాజు ఆదివారం ఆసుపత్రికి వెళ్లి ఆమె హెల్త్ పై, అందుతున్న సేవలపై డాక్టర్లను, రాజేందర్రెడ్డి, శోభారాణి లను అడిగి తెలుసుకున్నారు.మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.కళావతి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీ వెంట పద్దిరాజు రమేష్ ఉన్నారు.

## ఘనంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మైనార్టీ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు




**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని ఆదర్శనగర్ కాలనిలోగల సెట్విన్ చైర్మన్ యన్.గిరిధర్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఘనంగా యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, మైనార్టీ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు జమిలాలోద్దిన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి పాల్గొని వారికి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగిరెడ్డి, జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు తాహేరా బేగం, అక్తర్ గోరి, టీపీసీసీ మీడియా%డ% కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ అశ్విన్ పాటిల్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ నతానియల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జున్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ బబ్లూ, జుబేర్, అక్బర్, ఇమామ్ పటేల్, రాజు నాయక్, గోవర్ధన్ రెడ్డి, జహీర్ అరబ్బీ, నర్సింహా యాదవ్, ఎస్టీ సెల్ కోహీర్ మండల అధ్యక్షుడు వినోద్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హయ్యత్ ఎలైట్ ఆసుపత్రి సేవలు అభినందనీయం

**- జహీరాబాద్ ఎమ్మెల్యే కె మాణిక్ రావు**



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**
పేదలు, మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని సౌత్ మాల్ షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో నూతనంగా నిర్మించిన 50 పడకల హయ్యత్ ఎలైట్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వారు హాజరైన ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ....గతంలో హయ్యత్ హాస్పిటల్ డాక్టర్ అలీమ్ వారి సతీమణి డాక్టర్ బెనజీర్ ఖానమ్ లు ప్రజలకు చేసిన సేవలు అభినందనీయం అని , నూతనంగా ఏర్పాటు చేయబడిన హాస్పిటల్ లో వారు మరిన్ని సేవలను ప్రజలకు అందించాలని ఆకాంక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్య నిమిత్తం వచ్చే నిరుపేద వారికి అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించాలని, సామాజిక సేవ సాటి మనిషికి సహాయం చేసే అత్యంత గౌరవప్రదమైన వైద్య వృత్తిలో మరింత అభివృద్ధి చెందాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు కు హాస్పటల్ యాజమాన్యం శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మొహియుద్దీన్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా, యువ నాయకులు ముర్తుజా, గణేష్ , చంద్రయ్య , దీపక్, జూబేర్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మతంతో సంబంధం లేకుండా దళితులకు ఎస్సీలుగా గుర్తించాలి

**- ఆగస్టు 10న బ్లాక్ డే పాటించిన డిఎస్ఎం...**



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 10 :**
దళిత క్రైస్తవుల మత స్వేచ్ఛను హరించిన ఆగస్టు 10వ తేదీని బ్లాక్ డే పాటిస్తున్నట్లు దళిత సాలిడారిటీ మూవ్ మెంట్ (డిఎస్ఎం) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు హేమానంద్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం లో డిఎస్ఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు పెట్టుకుని నిరసన దినంగా పాటించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ....10వ ఆగస్టు, 1950న తీసుకొచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా దళిత క్రైస్తవుల హక్కులు కాలరాయబడ్డవని, దళితులు మతం మారితే ఎస్సీ రిజర్వేషన్ వర్తించదని చెపుతున్న ఆ రాష్ట్రపతి ఉత్తర్వు అగ్రవర్ణాల కుట్ర అని మండిపడ్డారు. అప్పటి రాష్ట్రపతి ఉత్తర్వులు దళితుల హక్కులను కాలరాసిందని వెంటనే ఆ ఉత్తర్వును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తమన్నారు. అనంతరం డిఎస్ఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు నిరసన దినంగా పాటించారు. మతంతో సంబంధం లేకుండా దళితులకు ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయికోటి నర్సిములు, జిల్లా నాయకులు శ్రీకాంత్ జాన్ చింతల్ గట్టు, శివరాజ్, దేవన్న దాస్, ప్రసాద్,స్టీఫెన్ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భీమా తో రైతుల కుటుంబ సభ్యులకు కొండంత అండ

**- అర్హులైన రైతులు రైతు భిమాకు దరఖాస్తు చేసుకోవాలి...**

**- పార్లమెంట్ ఇంచార్జ్ శుక్లవర్ధన్ రెడ్డి**



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**
రైతు భిమాతో రైతుల కుటుంబ సభ్యులకు కొండంత అండ ఉందని, 60 సం రాలలోపు మరణించిన రైతు గతంలో రైతు భీమా కలిగి ఉంటే వారి నామిని పేరిట 5 లక్షల నిధులు వారం రోజుల్లోపు వారి ఖాతాల్లో జమ అవుతాయని పార్లమెంట్ ఇంచార్జ్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తేది: 05-06-2025 నాటికి భూభారతి పోర్టల్‌లో డిజిటల్ సైన్ చేసిన పట్టాదారు పాస్ బుక్ ఉన్న రైతు అర్హులు 18 నుండి 59 సంవత్స రాల వయస్సు (పుట్టిన తేదీ :14-08-1966 నుండి 14-08-2007 వరకు, రెండు తేదీలు కలుపుకొని) ఉన్న వారు మాత్రమే అర్హులు. సంబంధిత రైతే స్వయంగా వచ్చి రైతు వేదికలో దరఖాస్తు అందజేయాలని, చివరి తేదీ:12.08.2025 అని, మీ వ్యవసాయ విస్తరణ అధికారిని రైతు వేదికలో కలిసి దరఖాస్తు చేసుకోవాలని పార్లమెంట్ ఇంచార్జ్ శుక్లవర్ధన్ రెడ్డి సూచించారు.

## నల్లమల్ల ప్రాంతం అచ్చంపేట నియోజకవర్గం పేద ప్రజలకు ప్రభుత్వ ఉచిత వైద్యం అందించడమే నా ప్రథమ కర్తవ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**వెలుతురు న్యూస్, అచ్చంపేట ఆగస్టు 10:**
రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా అచ్చంపేట ఏరియా హాస్పిటల్ లో పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని మెగా సర్జికల్ క్యాంపును నిర్వహించారు. విజయవంతంగా మూడో విడత మెగా సర్జికల్ క్యాంప్ ను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ క్యాంపు నిర్వహిస్తున్నామని ప్రకటించిన నాటినుండి పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ విడతలవారీగా సమస్యను బట్టి సర్జరీలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అచ్చంపేట ఏరియా హాస్పిటల్ లో అన్ని రకాల వసతులు సమకూర్చుతూ ప్రజలకు సేవ చేయడమే తమ బాధ్యతని చెప్పారు.





ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి సర్జరీలు చేశామని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. ఏరియా హాస్పిటల్ డాక్టర్లు పారామెడికల్ సిబ్బంది సహకారంతో ఈ యొక్క మెగా సర్జికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నా రు. గతంలో రెండు విడతల్లో ప్రభుత్వపరంగా మెడికల్ సర్జికల్ క్యాంపులను విజయవంతంగా నిర్వహించామని నియోజకవర్గ ప్రజలకు ఎంతోమందికి శాశ్వత చికిత్సలు చేసి నయం చేయడం జరిగిందని అన్నారు .దాంట్లో భాగంగా ఆదివారం మూడో విడత మెగా సర్జికల్ క్యాంపు నిర్వహించామని తెలిపారు. ఈ క్యాంపుకు 570 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అచ్చంపేట పరిసర ప్రాంత ప్రజలు పేద , మధ్యతరగతి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి కార్పొరేట్ వైద్యం చేసుకోలేని వారికి మన అచ్చంపేట ఏరియా హాస్పిటల్ లో మెగా సర్జికల్ క్యాంపులో ఉచితంగా శాస్త్ర చికిత్స చేసి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఏరియా హాస్పిటల్ లో నెలకొన్న సమస్యలపై ఇప్పటికే గౌరవ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని హాస్పిటల్ కి కావలసిన బ్లడ్ బ్యాంక్, సెంట్రల్ ఆక్సిజన్, పారామెడికల్ సిబ్బంది డాక్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు.



ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి డిఎంహెచ్ ఓ రవికుమార్, హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ ప్రభు, డిప్యూటీ డిఎంహెచ్ఓ తారా సింగ్, ఆర్ఎంఓ ప్రదీప్ రాజ్, మహేష్, పగడాల శ్రీనివాస్, బిక్కు లాల్ , మహిళా వైద్యులు, థియేటర్ అసిస్టెంట్లు , స్టాఫ్ నర్స్ పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీలో చేరిన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**వెలుతురు న్యూస్, అచ్చంపేట ఆగస్టు 10:**
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపి పార్టీలో చేరారు. ఆయనకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు బిజెపి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపిని ప్రజలు ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని అన్నారు. గువ్వల బాలరాజు కూడా ఆ విషయాన్ని ముందుగానే గుర్తించి బిజెపి పార్టీలో చేరడం అభినందనీయమని అన్నారు. అచ్చంపేటతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి అభివృద్ధికి గువ్వల బాలరాజు కృషి చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ఈ ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపించాలని పార్టీ శ్రేణులకు రామచంద్ర రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత ప్రధాని మోడీని విమర్శించే స్థాయి లేదని మళ్లీ ఓటమి తప్పదు అనే విషయాన్ని రాహుల్ గాంధీ ముందే గుర్తించారని అందుకే ఈసీ పై మోడీ పైన తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు అనంతరం గువ్వల బాలరాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాలన ఎన్డీఏ ప్రభుత్వ పనితీరు నాకు నచ్చింది. కాబట్టి బిజెపి పార్టీలో చేరుతున్నానని అన్నారు. రాష్ట్రంలో బిజెపిని బలోపేతం చేయడమే తన లక్ష్యమని పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



## బంగాళాఖాతంలో అల్పపీడనం... తెలంగాణలో మరింత తీవ్ర రూపం దాల్చనున్న వర్షాలు

**- ఆగస్టు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం**

**- హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అతి భారీ వర్షాలు**

**- హైదరాబాద్‌లోని కార్యాలయాలు పనివేళల్లో మార్పులు చేసుకోవాలని అధికారుల సూచన**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**
ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆగస్టు 13 నాటికి అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం ప్రకటించింది. దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు తీవ్రరూపం దాల్చనున్నాయని తెలిపింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఈ విషయంపై స్పందిస్తూ, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఎక్స్ వేదికగా తెలిపారు. భారీ వర్షాల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని కార్యాలయాలు ఆగస్టు 13, 14 తేదీల్లో పనివేళల్లో మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు, ఆగస్టు 13న ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అదే రోజు హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడనున్నాయి. ఆగస్టు 14న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, నల్గొండ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇప్పటికే హైదరాబాద్ సహా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం తర్వాత, ఆదివారం కూడా వర్షాలు కొనసాగాయి. దీంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరవాసులను హెచ్చరించారు. అనవసరంగా బయటకు రావద్దని, ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. గంటకు 10 సెం.మీ.కు పైగా వర్షం కురుస్తుండటంతో నగరాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని అర్వింద్ కుమార్ పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో వర్షపాతం సాధారణంగానే ఉందని, హైదరాబాద్ సహా ఎనిమిది జిల్లాల్లో అధిక వర్షపాతం, ఏడు జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని ఆయన వివరించారు.

## ‘ఓట్ చోరీ’ వెబ్ సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

**- ఈసీఐకి వ్యతిరేకంగా ‘ఓట్ చోరీ’ పేరుతో రాహుల్ గాంధీ ప్రచారం**


**- డిజిటల్ ఓటర్ల జాబితా విడుదల చేయాలని డిమాండ్**

**- ప్రజల మద్దతు కోసం ప్రత్యేక వెబ్‌సైట్, మిస్డ్ కాల్ నంబర్ విడుదల**

**- సోమవారం ఈసీఐ కార్యాలయానికి ఇండియా కూటమి ఎంపీల నిరసన ర్యాలీ**

**- రాహుల్ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన ఎన్నికల సంఘం**

**- ఇండియా కూటమి ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విందు**





**ఢిల్లీ వెలుతురు ఆగస్టు 10:**
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్ష్యంగా తన విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న తన డిమాండ్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు ‘ఓట్ చోరీ’ పేరుతో నేడు ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, దానిని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచారానికి సంబంధించి రాహుల్ గాంధీ ‘ఎక్స్’ వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. “వోట్ చోరీని బహిర్గతం చేయడం చాలా కీలకం” అని ఆయన పేర్కొన్నారు. “దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని ఆపేందుకు ప్రారంభించిన ఈ ప్రచారానికి మనస్ఫూర్తిగా మద్దతివ్వండి. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటం” అని ఆయన అన్నారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్ష పాతమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు, పార్టీలు ఓటర్ల జాబితాను తనిఖీ చేసేందుకు వీలుగా ఈసీఐ పారదర్శకంగా వ్యవహరించి డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రచారానికి మద్దతుగా votechori.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు. గత 10 ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అందించాలని ఆగస్టు 8న బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈసీఐని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అలా చేయడంలో విఫలమైతే, ఎన్నికల మోసాన్ని ఈసీఐ కప్పిపుచ్చినట్లే అవుతుందని, అది నేరంతో సమానమని ఆయన హెచ్చరించారు.
అయితే, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం “ఆధారరహితమైనవి”గా కొట్టిపారేసింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని ఈసీఐ స్పష్టం చేసింది.
ఈ నేపథ్యంలో, రేపు సోమవారం నాడు పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ఇండియా కూటమి ఎంపీలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించడానికి రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారు. ఈసీఐ అధికారులతో సమావేశం కోసం కూటమి నేతలు ఇప్పటికే సమయం కోరినట్లు సమాచారం. అదే రోజు రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఐక్యంగా పోరాడేందుకు విపక్షాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి.

## ట్రంప్‌పై పరోక్ష వ్యాఖ్యలతో విరుచుకుపడిన రాజ్‌నాథ్ సింగ్

**- భారత్ ఎదుగుదలను ఓర్వలేక కుట్రలు చేస్తున్నారంటూ రాజ్ నాథ్ సింగ్ ఫైర్**

**- భారత్ అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శలు**

**- భారత్ ఎదగకుండా ఏ శక్తీ అడ్డుకోలేదని స్పష్టీకరణ**



**ఢిల్లీ వెలుతురు ఆగస్టు 10:**
భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత వస్తువులపై 25 శాతం సుంకం విధించిన నేపథ్యంలో, కొన్ని దేశాలు భారత ఆర్థిక పురోగతిని అసూయతో చూస్తూ, దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. “కొందరు ‘బాస్’లు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న వేగాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మనమే అందరికీ బాస్ అయితే, భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోందని వారు అనుకుంటున్నారు?” అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లా, ఉమరియా గ్రామంలో బీఈఎంఎల్ (BEML) కొత్త యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. “కొన్ని దేశాలు భారతీయ ఉత్పత్తులను ఇతర దేశాల ఉత్పత్తుల కంటే ఖరీదైనవిగా చేయడానికి ప్రయత్నిస్తున్నాయి, తద్వారా ధరలు పెరిగితే ప్రపంచం వాటిని కొనడం మానేస్తుంది” అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. అయినప్పటికీ, “భారత్ ఇంత వేగంగా ముందుకు సాగుతోంది, ఇప్పుడు ఏ శక్తీ భారత్‌ను ప్రపంచంలో ఒక గొప్ప శక్తిగా ఎదగకుండా ఆపలేదు” అని ఆయన ధీమాగా చెప్పారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ రంగంలో అద్భుతమైన మార్పు వచ్చిందన్నారు. “ఒకప్పుడు ఆయుధాల నుంచి యుద్ధ విమానాల వరకు దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు మనం వాటిని మన దేశంలోనే తయారు చేయడమే కాకుండా, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఒకప్పుడు అతి తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు ఏకంగా రూ. 24,000 కోట్లకు పెరిగాయి. ఇది మన పెరుగుతున్న సామర్థ్యానికి నిదర్శనం” అని ఆయన వివరించారు. దేశ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, రక్షణ రంగం దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.